నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 27 మార్చి 2023

యాత్రతో జోష్



- సీపీఐ(ఎం) శ్రేణుల్లో నూతన ఉత్సాహం
- భారీ బైక్ ర్యాలీలతో అదరగొట్టిన కామ్రేడ్స్
- రెండో రోజు సంగారెడ్డి జిల్లాలో కొనసాగిన జనచైతన్య యాత్ర
- మోమిన్‌పేట వద్ద యాత్రకు వీడ్కోలు
- ఉత్సాహంగా పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కార్యకర్తలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ మతోన్మాద పోకడలు, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతూ ప్రజల్ని చైతన్యం చేసేందుకు సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సంగారెడ్డి జిల్లాలో రెండు రోజుల పాటు యాత్ర కొనసాగింది. సంగారెడ్డిలో జరిగిన బహిరంగ సభకు వేలాది మంది సీపీఐఎం శ్రేణులు హాజరవ్వడంతో సభ సక్సస్ అయ్యింది. రెండు రోజుల పాటు నిర్వహించిన బైక్ ర్యాలీలో రెడ్‌షర్ట్ ధరించిన కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. నూతన ఉత్సహంతో యాత్రలో పాల్గొన్నారు. ఎర్రజెండా పార్టీ సభ, బైక్‌ర్యాలీ విజయవంతం కావడంతో సీపీఐఎం రాజకీయ చట్రంలో చర్చ మొదలైంది.

రెండో రోజు కొనసాగిన యాత్ర

సీపీఐఎం జన చైతన్య యాత్ర ఆదివారం సంగారెడ్డి జిల్లాలో కొనసాగింది. రాత్రి బస్ చేసిన యాత్ర ఉదయం సంగారెడ్డిలో తిరిగి ప్రారంభమైంది. కేవల్ కిషన్ భవన్ నుంచి భారీ బైక్‌ర్యాలీతో యాత్ర బయలుదేరింది. సంగారెడ్డి చౌరస్తా, మల్కాపూర్ చైరస్తా, పెద్దాపూర్, నందికంది మీదుగా సదాశివపేటకు చేరుకోగానే సదాశివపేట, కొండాపూర్‌తో పాటు జహీరాబాద్ ప్రాంతానికి చెందిన సీపీఐఎం కార్యకర్తలు, నాయకులు తోడయ్యారు. సదాశివపేట చౌరస్తాలో ఘన స్వాగతం పలికారు. స్థానిక బస్టాంట్ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి యాత్ర బృంద నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడారు. అక్కడి నుంచి యాత్ర బైక్‌ర్యాలీతో కొనసాగి వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడ ఆ ప్రాంతానికి చెందిన సీపీఐఎం నాయకులు, కార్యకర్తలు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలకు యాత్ర బృందానికి వీడ్కోలు పలికి వికారాబాద్ జిల్లా వాళ్లకు అప్పజెప్పారు.

బీజేపీకి కార్పొరేట్లు తప్ప పేదలు పట్టరు: జాన్‌వెస్లీ, సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

బీజేపీకి కార్పొరేట్ మిత్రులు తప్ప ఈ దేశ ప్రజలు, అందులో పేదల గురించి అస్సలు పట్టింపు ఉండదని, ఈ విషయం ఈ తొమ్మిదేళ్ల పాలనలో అర్థమైందని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం యాత్రలో భాగంగా సదాశివపేట సెంటర్‌లో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. లక్షల కోట్ల రాయితీలిస్తూ అదానీ, అంబానీ ఇతర కార్పొరేట్ శక్తుల ఆస్తుల్ని పెంచుతున్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీ ఈ దేశంలోని కార్మికులు, రైతులు, కూలీలు, మహిళలపై మాత్రం భారాలు మోపుతున్నాడని విమర్శించారు. కార్పొరేట్ల ఆస్తుల్ని పదింతలు పెరుగుతుంటే కష్టపడుతున్న రైతులు మాత్రం అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి ఇస్తున్న రాయితీలను మోడీ తగ్గిస్తున్నాడన్నారు. గ్రామీణ వ్యవసాయ కూలీలకు పని కల్పించే ఉపాధి హామీకి నిధుల్లేకుండా చేస్తున్నాడన్నారు. గ్యాస్, నిత్యవసరాల ధరలు పెంచిన ఫలితంగా కుటుంబ పోషణలో మహిళల కష్టాలు రెట్టింపు అయ్యాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలివ్వట్లేదని, యువకులకు ఉపాధి దొరకని దుస్థితి నెలకొందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, ప్రతి ఒక్కరి ఎకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని ఇచ్చిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, టీ.సాగర్, బృంద సభ్యులు ఎస్.రమ, ఎంవీ రమణ, ఆర్.వెంట్రామ్‌లు, ధర్మా, విజయ్, రవి యాత్రలో ఉన్నారు. సీపీఐఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ.మల్లేశం, అతిమేల మాణిక్, కె.రాజయ్య, జి.సాయిలు, రామచంద్రం, నర్సింహ్మారెడ్డితో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.నర్సింహులు, ప్రవీణ్, ఎం.యాదగిరి, యాదవరెడ్డి, చిరంజీవి, రేవంత్‌కుమార్, విద్యాసాగర్, నాయకులు అశోక్, రమేష్, రాజయ్య, బాబురావు, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

CPIM జన చైతన్య యాత్ర







మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవ తెలంగాణ మిరు దొడ్డి

పట్టణాలకు దీటుగా పల్లెల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు భారాస ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎంపీ భారాస జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం అందెలో ఎస్సీ, ముదిరాజ్, రజక సామాజిక భవనాలతో పాటు మురుగు కాలువ నిర్మాణం పనులకు ఎంపీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ నిర్మాణంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటకు పరిహారంగా ఒక్కో ఎకరానికి రూ.పది వేలు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. నిరుపేదల సంక్షేమానికి భారాస ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి శంకర్, ఎంపీపీ సాయిలు, జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ లింగం, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, ఏఎంసి చైర్మన్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఎంపీటీసీ సభ్యురాలు లలిత సత్యం, కో ఆప్షన్స్ సభ్యుడు హమ్మద్, ఉప సర్పంచి కృష్ణవేణి అశోక్, భారాస మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు లింగం, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బాపురెడ్డి, భూపతి గౌడ్, బాగులు, ఆయా గ్రామాల సర్పంచులు కిష్టయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళన



నవ తెలంగాణ- దౌల్తాబాద్

దొమ్మాటలో 1992- 93 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివి ప్రస్తుతం వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాలలో స్థిరపడ్డారు. దౌల్తాబాద్‌లో శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారికి బోధించిన టీచర్లను ఘనంగా సన్మానించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పంచ స్వామి, కరుణాకర్ రెడ్డి, భీమన్న గారి సత్యం, కర్ణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చంద్రం, శ్రీనివాస్ రెడ్డి ,నరసింహారెడ్డి, భాగ్యమ్మ ,విజయలక్ష్మి, యాదగిరి, కిషన్, శంభు లింగం , కలీక్ పాల్గొన్నారు.

ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని.. నవమా సాలు మోసి.. కన్నకొడుకులను ఎంతో అప్యాయం గా.. అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసి.. ఓ ఇంటివారిని చేసింది. ఉన్న అస్తి పాస్తులను కన్నకొడుకులకు కట్టబెట్టి నేడు ఓ రేకుల ఇంట్లో మూడెం డ్లుగా ఒంటరిగా బిక్కుబిక్కుమం టూ దుర్భర జీవితం వెళ్లదీస్తోంది. కొడుకులు తనను కడదా కా కంటికి రెప్పలా కాపాడుతారనే ఆశించిన వృద్ధురాలి ఆ శలు భ్రమగానే మిగులుతున్నాయి. నా జీవితం కన్నకొడుకు లేనని నమ్మితే దగ్గర ఉన్నదంతా తీసుకుని.. అధ్వానంగా వదిలేశారని ఆవేదన చెందుతోంది.

అంతా తీసుకున్నారు అధ్వానంగా వదిలేశారు



- కన్నకొడుకుల తీరుపై వృద్ధురాలి ఎసిక లచ్చవ్వ ఆవేదన
- వారం రోజులుగా తిండిలేక అలమటిస్తున్న వైనం
- ఆసరా పింఛన్‌తోనే కాలం వెళ్లదీస్తున్నాని అసహనం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి అనుబం ధ గ్రామమైన పాపన్నపల్లి గ్రామానికి చెందిన ఎసిక లచ్చవ్వకు ఇద్దరు కుమా రులు, ఇద్దరు కుమార్తెలు.పెద్ద కుమారుడు ఎసిక రాజేందర్ కామారెడ్డిలో స్థిరపడ్డాడు. చిన్న కుమారుడు ఎసిక రమేశ్ అల్లునూర్ గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. ఎసిక లచ్చవ్వ తన దగ్గరున్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును కొడుకులకు అందజేసింది. సుమారు 12 ఎకరాల భూమిని కన్నకొడుకులు విక్రయించుకుని వృద్ధాప్యంలో ఆమెను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కన్నకొడుకులు పట్టించుకోకపోవడంతో దుర్భర జీవితం వెళ్లదీస్తోంది. కనీస మౌలిక వసతుల్లేని రేకుల ఇంట్లో ఒంటరి జీవితం గడుపుతోంది ఆ తల్లి. ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా పింఛన్‌తోనే మందులు కొనుగోలు, మిగతా ఖర్చులను వెళ్లదీస్తున్నానని అసహనం వ్యక్తం చేస్తోంది. కని.. పెంచి పెద్ద చేసిన తన సంతానం ఒంటరిదాన్ని చేసి వదిలేశారని ఆమె వాపోతోంది. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని మానవత్వంతో సకాలంలో ఇంటి వద్దకు అందించేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని వేడుకుంటోంది.

నల్ల చట్టాలు తెచ్చి 800 మంది రైతుల ఉసురు తీసిన కేంద్రం

- రైతుల కోసం ఏదైనా చేసే వ్యక్తి సీఎం కేసీఆర్
- రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు



నవ తెలంగాణ - సిద్దిపేట

రైతుల గురించి బీజేపీ మాట్లాడటమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లేనని, నల్ల చట్టాలు తెచ్చి 800 మంది రైతుల ఉసురు తీసిందని, రైతులంటే కేసీఆర్‌కు మక్కువని, వడగండ్ల వానతో నష్ట పోయిన రైతులకు ఎకరాకు సీఎం రూ.10 వేలు అందిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో బిందు సేద్యం ద్వారా వ్యవసాయం చేసే 763 మంది రైతులకు స్ప్రింక్లర్లను ఆదివారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతులకు రైతు బంధు, రైతుబీమా, నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. బీజేపీ వాళ్ల పాలన ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చేస్తున్నారా అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రైతుకు సీఎం కేసీఆర్ కొండంత అండ అని అన్నారు. కేంద్రం మరోసారి యాసంగి వరి పంట కొనమని చేతులెత్తేసిందనీ, కానీ మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గింజ కొంటామని తేల్చి చెప్పారని, రైతులను కేసీఆర్ ఓదారిస్తే, బీజేపీ వంకర మాటలు మాట్లాడుతున్నదని ఎద్దేవాచేశారు. దేశంలో ఎక్కడ చూసినా తెలంగాణ రాష్ట్రం తరహా పాలన కావాలని, సంక్షేమ పథకాలు కావాలని పక్క రాష్ట్రాలలో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయనీ అన్నారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ ఎకరాకు 10 వేలు ప్రకటిస్తే.. 10 వేలు చాలవని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సన్నాయి, నొక్కులు నొక్కుతున్నారని, మీకు తెలంగాణ రైతుల మీద ప్రేమ ఉంటే, కేంద్రం నుంచి మరో 10 వేలు ఇస్తే కలుపుకుని రైతుకు 20 వేలు ఇద్దామని, రైతుల పక్షాన అండగా నిలుద్దామని అన్నారు. కాలువల నిండా కాళేశ్వరం నీళ్లు, కడుపునిండా తాగునీళ్లు, 24 గంటల ఉచిత కరెంట్ తెలంగాణ రాష్ట్ర సర్కారు విధానాల వల్ల ఈ యాసంగిలో 56 లక్షల వరి నాట్లు వేశారని, అన్నపూర్ణగా పలికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేవలం 16 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారనీ, దేశం మొత్తం మీద 97 లక్షల ఎకరాల్లో వరి సాగు అయితే, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 56 లక్షల ఎకరాలు సాగు అవుతున్నదని, రైతు బిడ్డ కేసీఆర్ ముందుచూపుతో వ్యవసాయంలో తెలంగాణ రైతు గెలిచి నిలిచాడని అన్నారు. శివుడి జటాజూటం నుంచి గంగమ్మ తల్లి పరుగులు పెట్టినట్లు, కాళేశ్వరం నీళ్ల తెలంగాణ రైతు భూముల్లోకి పరవళ్ల తొక్కుతున్నాయని, నదికి కొత్త నడక నేర్పిన ఘనత కేసీఆర్ దే నని అన్నారు. తెలంగాణలో ఒకనాడు భూమి అమ్ముదామంటే కొనేవాడు లేరని, ఇప్పుడు కొందామంటే అమ్మేటోళ్లు లేరని, మరోవైపు తెలంగాణలో నాట్లు వేయడానికి పక్క రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారని, తెలంగాణ పక్క రాష్ట్రాలకు, పక్క దేశాలకు అన్నం పెడుతున్నదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలవి మాటలు తప్ప చేతలు ఉండవని, బాయికాడ విద్యుత్ మీటర్లు పెడితే పైసలిస్తామని బీజేపీ మెలిక పెటిందని, పక్క రాష్ట్రాల వాళ్ళు మీటర్లు పెట్టి పైసలు తీసుకున్నారని, కానీ సీఎం కేసీఆర్ మీటర్లు వద్దన్నారని అన్నారు. కాళేశ్వరం నీళ్ల కాలువల్లో పారడం లేదనంటున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలను ఆ కాలువల్లో ముంచితే నీళ్ల పారుతున్నాయా లేదా తెలుస్తుందని అన్నారు. అంతకుముందు జెడ్పి చైర్ పర్సన్ రోజా శర్మ , ఎమ్మెల్సీ ఫారకు హుస్సేన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుల పాలనలో రైతులు నేడు రాజులు లాగా బతుకుతున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్ప్రింక్లర్ల సెట్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు విజిత వేణుగోపాల్ రెడ్డి, గంప రామచంద్రరావు, మాణిక్య రెడ్డి , రవీందర్ రెడ్డి, రాధాకృష్ణ శర్మ జాప శ్రీకాంత్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసం కాంగ్రెస్, మతం పేరిట బీజేపీ చౌకబారు రాజకీయాలు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



నవతెలంగాణ-కోహెడ

ఉనికి కోసం కాంగ్రెస్, మతం పేరిట బిజెపీ చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగరాయ ఫంక్షన్‌హాలులో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగరవేయడమే ప్రధాన ఎజెండాగా గులాబీ సైనికులు నిలవాలన్నారు. అలాగే కార్యకర్తలే పార్టీకి వెన్నుముక అని, పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎదుగుదలను చూసి ఓర్వలేక నిరాధారమైన ఆరోపనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో బిజెపీ ఎంపీగా గెలిచి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడ తేలేదని ఆరోపించారు. ఉనికి కోసం కాంగ్రెస్ చూస్తుందని అభివృద్ధిపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చెరువయ్యేందుకు సహకరించాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుభీమా, కెసీఆర్ కిట్, కెజీ టూ పీజీ ఉచిత విద్య, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి లాంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 45 వేల పెన్షన్‌లు మంజూరి అవుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రతిరోజు ఐదు లక్షల ఎల్‌ఓసీ, ప్రతి నెల 150 సీఎంఆర్‌ఎఫ్ మంజూరవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేసి హ్యాట్రిక్ విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల మధుసూదన్‌రావు, ప్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు, వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, ఎంపీటీసీలు, సర్పంచ్, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ప్రామాణికం

- బీఆర్ఎస్ జిల్లా ఇన్చార్జ్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి



తెలంగాణ జహీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ప్రమాణికంగా మారుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్యరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలతో ఇతర రాష్ట్రాలలోని ప్రభుత్వాలు హడలిపోతున్నాయని అన్నారు. మహారాష్ట్రలోని రైతులు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తండోపదండాలుగా పార్టీలో చేరడంతో అక్కడి ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.6 వేలు ఇచ్చేందుకు దిగి వచ్చిందన్నారు. అభివృద్ధిని చూసి జీవించుకోలేక కొన్ని పార్టీల నాయకులు దుష్ప్రచారం చేస్తున్నందువల్లనే గ్రామ గ్రామాన ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పటాన్చెరు సదాశివపేట నారాయణఖేడ్ నియోజకవర్గాలలో ముఖ్య నాయకుల సమావేశాలను నిర్వహించామని తెలిపారు. జహీరాబాద్‌లో కూడా సమావేశాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే మాణిక్యరావు ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఈ సమ్మేళనాలను నియోజకవర్గంలోని 10 గ్రామాలను కలిపి ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసి ఆయా బ్లాక్ ల వారీగా నిర్వహిస్తున్నామని అన్నారు . ఏప్రిల్ 20వ తేదీ వరకు వీటిని పూర్తి చేస్తామని అన్నారు 21 సంవత్సరాలు కష్టపడి పోరాడి సాధించుకున్నటువంటి తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా మారడంతో కొన్ని పార్టీలకు గుండెల్లో దడ పుట్టుకొస్తుందన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు మహమ్మద్ తనివిర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహంకాల్ సుభాష్ గుప్తా, పాండురంగారెడ్డి ,సుభాష్ రెడ్డి, సంగమేశ్వర్, నర్సింలు, బాబి, మోహియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు




నవతెలంగాణ జహీరాబాద్: అదానీ కుంభకోణం కేసును పక్కదారి పట్టించేందుకే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు వేశారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిండా ముంచి, అక్రమ పత్రాలతో డొల్ల కంపెనీలు సృష్టించి లక్షల కోట్ల రూపాయలను దోపిడీ చేసిన అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలని ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, బయట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, దీనికి సమాధానం చెప్పలేని బీజేపీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించడానికి రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం ... టు సభ్యులపై నేరపూరిత కేసులు నమోదయ్యాయని, కింది కోర్టులు వారికి శిక్ష విధించినా పైకోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకొని సభ్యులుగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. ఇందులో ఎక్కువ మంది బిజెపికి చెందిన ఎంపీలు, ప్రజాప్రతినిధులు కావడం గమనార్హమని తెలిపారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును అవకాశంగా తీసుకొని కుట్రపూరితంగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజు అని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఏకమై మోడీ నిరంకుశ విధానాలపై, అదానీ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేసే వరకు పోరాటాలు కొనసాగించే సందర్భం ఆసన్నమైందని తెలిపారు. గతంలో కూడా ఇలాగే తొమ్మిది రాష్ట్రాల్లో ప్రజాస్వామికంగా ప్రభుత్వాలను కూల్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. కేవలం అదానీ, అంబానీ ల కోసమే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కేవలం కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాస్తుందన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా ఇలా ఒక రంగానికి కొమ్ము కాయడం సరికాదన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై నిరసన తెలుపకపోతే భవిష్యత్తులో ప్రతిపక్ష పార్టీలను గుర్తింపును రద్దు చేసి ఏక పార్టీ వ్యవస్థను బలపరిచే చర్యలకు మోడీ సర్కార్ దిగుతుందని తెలిపారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి నర్సింలు అశ్వక్ హుస్సేన్, బక్కన్న, రాములు, అజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్



నవతెలంగాణ-సంగారెడ్డి: ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ అన్నారు. ఆదివారం రమేష్ మాట్లాడుతూ నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులో ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నారాయణఖేడ్ ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అందులో ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయడానికి నారాయణఖేడ్ పట్టణంలో సెంటర్ పడడంతో అక్కడికి వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తోందన్నారు. సామాను మోసే బొలెరోలో తీసుకెళ్లడంతో విద్యార్థులు ఎండతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎండాకాలం విద్యార్థులు వెళ్లి రావాలంటే 12 కి మి అవ్తుందన్నారు. వడదెబ్బ తలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏమవుతుందో అని ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఆర్ సి ఓ చొరవ తీసుకొని విద్యార్థులకు మంచి రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు సతీష్ పిండ్లిక్ ఉన్నారు.



ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ ఐడీఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీలో పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ కాలనీకి చెందిన తారకేశ్వరరావు ఆత్మహత్య చేసుకోవడంతో విషయం తెలుసుకున్న ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు వివరించారు. వెంటనే ఆయన స్పందించి రూ.10 వేలు ఎన్ ఎం ఆర్ యువసేన సభ్యుల ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు. అందుకుగాను ఆ కుటుంబ సభ్యులు నీలం మదన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంతి శంకర్, నరేన్, లోకేష్ బాబు,రాకేష్, ధర్మారావు, గోవర్ధన్, నరసింహ చారి పాల్గొన్నారు.

శనిగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని బొక్కస్ గావ్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనిగల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఆదివారం బొక్కస్ గావ్ గ్రామ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శనిగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనిగల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనిగలు క్వింటాల్‌కు రూ. 5,335 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జార మహిపాల్ రెడ్డి. వైస్ ఎంపీపీ మాధవ రావు పాటిల్. పిఏసిఎస్ ఛైర్మెన్ వెంకట్ రాములు. ఖేడ్ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్. మాజీ ఎంపీటీసీ కృష్ణ గౌడ్.నాయకులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

గ్రామ ఖంఠం భూమి ఆక్రమించేందుకు యత్నం

నవ తెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని శంశోల్లాపూర్ గ్రామంలో నూతన పంచాయతీ భవనం నిర్మించేందుకు సర్పంచ్ మీనాక్షి ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కింగ్ వేశారు. గ్రామస్తులు కొందరు ఆ స్థలం ఆక్రమించి అంబేద్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాల ఏర్పాటు చేయడానికి జెండాలు పాతారు. సర్పంచ్ హద్నూర్ ఎస్సై వినయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని జెండా లను తొలగించారు. గ్రామంలో ఎక్కడైనా జెండాలు ఏ ర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

తెలంగాణ పోరాటయోధుడు ధర్మబిక్షంగౌడ్



నవ తెలంగాణ-హత్నూర

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు ధర్మ బిక్షం గౌడ్ స్ఫూర్తితో ముందుకు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, గోడ జన హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ గౌడ్ అన్నారు. ఆదివారం హత్నూర మండలం దౌల్తాబాద్ లో ధర్మ బిక్షం గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి గౌడ సంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుడు ధర్మ బిక్షం గౌడ్ స్ఫూర్తితో నేటి యువత పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ జాతి కోసం ఐక్యంగా పోరాడిన మహానుభావుడు ధర్మ బిక్షం గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు దుర్గం గౌడ్, యాదవ్ గౌడ్, శేఖర్ గౌడ్, అంజా గౌడ్ ,లక్ష్మణ్ గౌడ్, అనంతరామ గౌడ్, రామా గౌడ్, నగేష్ గౌడ్ పాల్గొన్నారు.

రంజాన్‌కు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్

రంజాన్‌కు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని అన్ని వార్డుల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఎంఐఎం ప్రధాన కార్యదర్శి మోహీద్ పటేల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఖేడ్ ఎలక్ట్రిసిటీ ఏఈకి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫర్మర్స్ మరమ్మతులు ఉంటే త్వరితగతిన పూర్తి చేస్తామని ఏ.ఈ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎం ఐ ఎం నాయకులు తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ జిన్నారం

జిన్నారం మండలం గడ్డ పోతారం గ్రామపంచాయతీ పరిధిలోని చెట్ల పోతారం గ్రామానికి చెందిన బాలుగారి కలమ్మ అంత్య క్రియలకు భారత రాష్ట్ర సమితి నేత, చిట్కుల్ గ్రామపంచాయతీ సర్పంచ్ రూ.20 వేలలను ఆదివారం అందజేశారు. పటాన్ చెరువు నియోజకవర్గ జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామానికి చెందిన బాలు గారి కలమ్మ గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మరణించిన విషయాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు దృష్టికి స్థానిక ఎన్ ఎమ్ ఆర్ యువసేన ప్రతినిధులు తీసుకు వెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సహాయం అందించారు. సదరు సాయాన్ని నారబోయిన శ్రీనివాస్ బృందం ఆదివారం బాలు గారి కలమ్మ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గడ్డ పోతారం వార్డు సభ్యులు మద్దూరి కార్తీక్, మద్దూర్ పటేల్ శివ శంకర్,మాజీ సర్పంచ్ ఎంపీ అశోక్, గడ్డపోతారం చెట్ల పోతారం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారబోయిన కుమార్, మత్స్యశాఖ అధ్యక్షులు బాలు గారి నర్సింలు, గడ్డపోతారం ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ప్రదీప్ ఎస్.ఎం.ఆర్ యువసేన సభ్యుల గడ్డపోతారం నారబోయిన శ్రీనివాస్, చిటుకుల అర్జున్, బాలు గారి శ్రీనివాస్,బి శ్రీనివాస్, బోయ బిక్షపతి, పోలీస్ పటేల్ సత్యనారాయణ, బోయిని యాదగిరి, రవి, గిరిప్రసాద్, కొర్లకుంట రాజు, వంట రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రిన్సిపాల్ అంత్యక్రియలు



నవ తెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ లో గల ఎం ఆర్ఎఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ ఇమ్మాను యేల్ అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు మెథడిస్ట్ స్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రవీణ ఇమ్మానుయేల్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు.

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిద్దాం

- సదాశివపేటకు చేరిన జన చైతన్య యాత్ర
- సదాశివపేటలో జన చైతన్య యాత్రలో భాగంగా భారీ బైక్ ర్యాలీ
- బస్టాండ్ వద్ద సభ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు









నవతెలంగాణ- సదాశివపేట: 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలి. బడా పెట్టుబడుదారుల కోసం పనిచేస్తూ ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి. దేశంలో సంక్షేమం, మతసామరస్యం ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కోసం సీపీఎం పోరాటాలు నిర్వహిస్తోంది' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర ఆదివారం సదాశివపేట పట్టణానికి చేరుకుంది. పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ముందు సభ ఏర్పాటు చేశారు. సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో చుక్క రాములు, జన చైతన్య యాత్ర బృంద నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ 9 సంవత్సరాలలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులను బడా పెట్టుబడిదారులుగా తయారు చేసిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతూ 23 కోట్ల మందిని పేదలుగా మార్చేసిందన్నారు. దేశమంటే అదానీ, అంబానీ సొత్తుగా మార్చేశారన్నారు. గ్యాస్ పెట్రోల్ డీజిల్, అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. ప్రపంచ మానవ అభివృద్ధి ఆకలి సూచికలో మన దేశం 141వ స్థానానికి దిగజారిందన్నారు. విద్యలో 30వ స్థానంలో ఉందన్నారు. లక్షల కోట్ల నల్లధనం తీసుకువచ్చి ప్రతి పేద కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి మోసం చేశారన్నారు. గద్దెనెక్కినాక తినే తిండి మీద కట్టుకునే బట్ట మీద మనం రోజు వాడే ప్రతి వస్తువు మీద ఒకే దేశం ఒకే పన్ను పేరుతో జీఎస్టి విధించారన్నారు. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని అన్నారు. ఎందరో వీరులు తమ ప్రాణాలను అర్పించి సాధించిన స్వతంత్ర భారతం నేడు మతోన్మాదుల చేతుల్లో చిక్కి విలవిల్లాడుతోందన్నారు. మత సమరస్యాన్ని కాపాడాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య నిరంతరం చీలికలు తెస్తోందన్నారు. ముస్లింలు క్రైస్తవులకు వ్యతిరేకంగా సెంటిమెంట్ రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కూడా కాల రాస్తూ ఉంది పాలకులపై ఎవరైనా విమర్శలు కాలరాస్తూ సీబీఐ, ఈడీలతో దాడులు చేయిస్తున్నారని తెలిపారు. రిజర్వేషన్లను నీరుగార్చేందుకు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజల పాలిట నియంతలా మారి పరిపాలన చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని, రాబోయే కాలంలో బీజేపీని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు సాగర్, రమ, రమణ, సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, సాయిలు, మల్లేశం, రామచందర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, సీపీఎం సదాశివపేట మండల నాయకులు రమేష్‌గౌడ్, మల్లేశం, ఎండి ఖయ్యూం, అశ్వక్, శ్రీనివాస్, యాదవ్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కిష్టారెడ్డిపేటలో దుర్గానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం





నవ తెలంగాణ - అమీన్ పూర్

నియోజకవర్గం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కంటికి రెప్పల కాపాడుకుంటున్నామని తెలిపారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేట గ్రామంలో గల దుర్గానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం పటాన్ చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. పరిశ్రమల సమీపంలోని గ్రామాలలో నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. దుర్గా నగర్ కాలనీలో జిబిఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో సుమారు ఏడు కోట్ల రూపాయలతో ఐదు కిలోమీటర్ల సిసి రోడ్లు నిర్మించామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఘన విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమీన్ పూర్ ఎంపీపీ ఈర్ల దేవానందం ముదిరాజ్ , జెడ్పీటీసీ గంగుల సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దండు సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్, దుర్గా నగర్ కాలనీ అధ్యక్షులు ఎం డి ఫహీం, అమీన్ పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు తులసి రెడ్డి, రాజు పాల్గొన్నారు.

గీతం పరిశోధక విద్యార్థి రామిరెడ్డికి డాక్టరేట్



నవ తెలంగాణ - పటాన్‌చెరు

'ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)పై పెట్టుబడిదారుల ప్రవర్తన - ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకుల మ్యూచువల్ ఫండ్ ల అధ్యయనం' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మేనేజ్మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి కొత్తమారం వెంకట రామిరెడ్డిని డాక్టరేట్ వరించింది. గీతం బిజినెస్ స్కూల్- హైదరాబాద్ పూర్వ ప్రొఫెసర్ ఏ.శ్రీరామ్ ఈ పరిశోధనకు మార్గదర్శనం వహించినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించాయి. నేరుగా వృద్ధిచెందే ఈఎల్ఎస్ఎస్ మ్యూచువల్ ఫండ్స్ పబ్లిక్-ప్రైవేటు రంగ బ్యాంకుల విశ్లేషణాత్మక అంచనా, మెరుగైన పెట్టుబడి నిర్ణయాల లక్ష్యంగా ఈ అధ్యయనం సాగినట్టు పేర్కొన్నారు. పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి ప్రైవేటురంగ ఈఎల్ఎస్ఎస్ ఫండ్లలో యాక్సిల్ దీర్ఘకాలిక ఈక్విటీ ఫండ్లతో పాటు ప్రభుత్వ రంగ బీవోఐ ఏఎక్స్ పన్ను రాయతీలున్న ఫండ్లలో పెట్టుబడి, పెట్టవచ్చనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలిపారు.రామిరెడ్డి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం బిజినెస్ స్కూల్- హైదరాబాద్ డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.కరుణాకర్, ప్రొఫెసర్ వినయ్ కుమార్ అప్పరాజు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

నేడు గడ్డపోతారంలో గులాబీ దళ సమ్మేళనం

నవ తెలంగాణ జిన్నారం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలను సారం పటాన్చెరువు నియోజకవర్గం శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచనల మేరకు ఈ నెల 27న బీఆర్ఎస్ పార్టీ జిన్నారం మండల ఆత్మీయ సమేళన సమావేశం గడ్డపోతారం గ్రామంలోని పులిగిల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జిన్నారం మండలం భారత రాష్ట్ర సమితి శాఖ అధ్యక్షులు నాయి కోటి రాజేష్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన జిన్నారంలో విలేకరులతో మాట్లాడుతూ పటాన్చెరు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొనే గులాబీ దళం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలోభాగంగా సోమవారం ఉదయం ఉదయం 9.00 గంటలకు అన్ని గ్రామాల కార్యకర్తలు బైక్ లతో గురుకుల పాఠశాల చౌరస్తాకు చేరుకోవాలన్నారు. జిన్నారం గురుకుల పాఠశాల చౌరస్తా నుండి గడ్డపోతారం వరకు భారీ స్థాయిలో నిర్వహించి తలపెట్టిన భారీ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాసిన జిన్నారం వెంకటేశంగౌడ్‌లతో కలిసి ప్రారంభిస్తారన్నారు. గడ్డపోతారం పులిగిల్ల ఫంక్షన్ హాల్ వరకు కొనసాగునున్న బైక్ ర్యాలీ తదనంతరం బిఆర్ఎస్ మండల స్థాయి ఆత్మీయ సమేళన సమావేశం నిర్వహించినున్నట్లు తెలిపారు.

బంగారు బాక్సర్లకు జేజేలు

నవ తెలంగాణ జిన్నారం

ప్రతిష్టాత్మకమైన మహిళా బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్షిప్లో భారత బాక్సర్లు నీతూ గంగాస్,స్వీటీ బూర లు బంగారు పతకాలు సాధించడం హర్షణీయని జిన్నారం మండల మాజీ ఉపాధ్యక్షులు మద్ది వీరారెడ్డి, ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచులు తులసీదాస్, జయశంకర్ గౌడ్, బొంతపల్లి ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్ అభినందించారు. ప్రపంచ కప్ షుటింగ్ ఛాంపియన్షిప్ లో భారత షుటర్ ఒలంపియన్ మనుబాకర్ కాంస్య పతకం దక్కించుకోవడం ప్రశంసనీయమన్నారు. మహిళా మణులు అత్యుత్తమమ్మంగా పథకాలు సాధిస్తూ భారతదేశ కీర్తి పతాకాలను రెపరెపలాడించడం అభినందనీయమన్నారు.

గట్లమల్యాలలో స్ప్రింక్లర్ల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సహకారంతో నంగునూరు మండలం గట్ల మల్యాల గ్రామంలో ఆదివారం 100 స్ప్రింక్లర్ సెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్, వైస్ ఎంపీపీ రేణుక వేణుగోపాల చారి, రైతులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర జయప్రదానికి తరలివెళ్లిన నాయకులు



నవతెలంగాణ జహీరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు విచ్చలవిడిగా ఇవ్వడానికి వ్యతిరేకంగా, సంక్షేమం, సామాజిక న్యాయం, మతసామరస్యం, ప్రజాస్వామ్య విలువల కోసం జరుగుతున్న సీపీఎం జనచైతన్య యాత్ర 2 రోజు జరిగే బస్సుయాత్రకు జహీరాబాద్ నుండి పెద్ద ఎత్తున వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రాంచందర్ మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా ఇస్తూ దేశ సంపదని లూటీ చేస్తుందన్నారు. బిజెపి ప్రజల మధ్య మత ఘర్షణలు సృష్టించడం కోసం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైపాల్, సలీముద్దీన్, కౌడీ నర్సింలు, నరేష్, లక్ష్మణ్, రాజు, దక్షిణామూర్తి, నర్సింలు, సంగన్న చంద్రన్న, బక్కన్న శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

28న జరిగే సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సును జయప్రదం చేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఈ నెల 28న జరిగే సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ ఖాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌ఖాన్ మాట్లాడుతూ బీజేపీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో దేశవ్యాప్తంగా సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28న సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్లో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐబీ నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభిస్తామన్నారు. ఈ సదస్సుకు సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యులు నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, హాజరవుతున్నారని తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలో ఉన్న పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రద చేయాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రుబీన బేగం, సునీత, కౌన్సిల్ సభ్యులు అజార్, పట్టణ నాయకులు బాబా, కృష్ణ పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మునిపల్లి

పెద్దలోడి గ్రామంలోని బీరప్ప ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. పెద్దలోడి గ్రామంలో జరుగుతున్న బీరప్ప జాతరోత్సవాల్లో భాగంగా ఆదివారం బీరప్ప కామరాతి కల్యాణం ఎంపీటీసీ రేణుకా వెంకటేశం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కల్యాణానికి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్ కిరణ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్. జడ్పీటీసీ పైతర మీనాక్షి, వట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రజనీకాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, యువత మండల అధ్యక్షుడు ఆనంద్, కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపల్లి పాండు, సంఘం యువత అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బండారి పాండు, మండల అధ్యక్షుడు శంకరయ్య, సర్పంచులు వీరన్న పాటిల్, రమేష్, విశ్వనాథం, శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మి నగేష్, నాయకులు వెంకటేశం, శ్రీనివాస్, అశోక్, మొగులయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ- గజ్వేల్: గజ్వేల్ మండలం బయ్యారం సర్పంచ్ మద్దూరు శ్రీనివాస్‌రెడ్డి నూతన గృహప్రవేశం గజ్వేల్‌లో జరిగింది. ఆదివారం జరిగిన కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జాకీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెరుకు చంద్రమోహన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ప్రవీణ్, పార్టీ సీనియర్ నాయకులు కుర్ర సాయిరెడ్డి, బాబు మోహన్ తదితరులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుమారుడి మృతి



నవతెలంగాణ-సంగారెడ్డి

రోడ్డు ప్రమాదంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన సంగారెడ్డి మండలంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం సాయంత్రం సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ కుమారుడు ప్రశాంత్(21)తో పాటు మరో యువకుడు సాయి కలిసి బైక్ మీద కంది గ్రామం నుంచి సంగారెడ్డి వస్తున్నారు. ఈ క్రమంలో జెంజెం దాబా దాటిన తరువాత జరిగిన కారు, బైక్ రోడ్డు ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ఆసుపత్రికి చేరుకుని జయరాజ్ కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మల్లేశం, ఏ.మాణిక్యం, కె.రాజయ్య, జి.సాయిలు, నర్సింహారెడ్డి, యాదగిరి, యాదవరెడ్డి, నర్సిములు, అశోక్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా నాయకులు ఉన్నారు.



కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



నవ తెలంగాణ-అమీన్‌పూర్

నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనతో పాటు సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటేల్ గూడ గ్రామ పరిధిలోని సిద్ధార్థ ఎంక్లేవ్ కాలనీలో జి వి ఆర్ ఎంటర్‌ప్రైజస్ సంస్థ సి ఎస్ ఆర్ కార్యక్రమాల్లో భాగంగా అరవై లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ ను కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఈర్ల దేవానం ద్ ముదిరాజ్ , జెడ్పీటీసీ గంగుల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ ఈర్ల నితీశా శ్రీకాంత్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, ఉప సర్పంచ్ పసుల జానకి జ్ఞానేశ్వర్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ ఏనుగు తులసిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



నవ తెలంగాణ-అమీన్ పూర్

నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పిఎస్ఆర్ కాలనీలో గల శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు కల్పనా ఉపేందర్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, కృష్ణలింగం గౌడ్, బాస్కర్ రెడ్డి, యాదవ రెడ్డి, ఆలయ కమిటీ, నిర్వాహకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

28న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి హరీశ్‌రావు



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈ నెల 28న పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొననున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. జిఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల కోసం జివిఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో 2 కోట్ల 10 లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన 210 ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయడంతో పాటు పటాన్ చెరు పోలీస్ స్టేషన్ నుండి రిలయన్స్ ఇండస్ట్రీస్ వరకు 10 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన పట్నం మాణిక్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఉల్లాసానికి క్రమశిక్షణకు క్రీడాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మాణిక్యం ఫౌండేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం జరుగుతుందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 24 టీములు పాల్గొనడం జరిగిందని అన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ కు పిఈటి బృందానికి అభినందనలు తెలియజేశారు. గంగానర్సరీ ఎండి ఐసీ మోహన్, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు,గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ప్రేమానందం, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుగ్గీల్లలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ-బెజ్జంకి

ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు గొప్పవరాలని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సీత లక్ష్మి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వజ్ర ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు సుమన్ ప్రజలకు ఉచిత బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.అనంతరం ఉచిత వైద్య శిబిరం సిబ్బందిని సర్పంచ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ డైరెక్టర్ సీత భూమయ్య పాల్గొన్నారు.

అలయ నిర్మాణానికి జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా సాయం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా రూ.30 వేల విరాళం ప్రకటించారు. శివంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆలయ నిర్వాహకులకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆదివారం విరాళాన్ని అందజేశారు .ఈ సందర్భంగా జెడ్పీటీసీ మహేష్ గుప్త మాట్లాడుతూ ఇప్పటివరకు ఆపదలో ఉన్న ఎంతో మందికి తన వంతు సహాయం అందించడం జరిగిందన్నారు. ఆలయాల నిర్మాణానికి సైతం విరాళాలు అందించినట్లు మహేష్ గుప్త తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సహాయం అందించడంలో ఎప్పటికి తాను ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట గ్రామస్తులు పీఏసీఎస్ డైరెక్టర్ కృపాచారి, బిక్షపతి, నరసయ్య, రమేష్, శివంపేట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పోచ గౌడ్, కొండల్ తదితరులు ఉన్నారు

ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ముఖ్యం

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

విద్యార్థి దశ నుంచే ఆత్మ రక్షణకు ఉపయోగపడే కరాటే లాంటి వాటిపై దృష్టి సారించాలని కరాటే ఆత్మరక్షణకు చాలా ముఖ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ఇంటర్ స్కూల్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు (కంగ్‌ఫ్యూ)లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యం స్కూల్ దండుపల్లి, రిషి మెమోరియల్ స్కూల్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ చేగుంట, జెడ్పీహెచ్ఎస్ కానుకుంట పాఠశాలల విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మరొకరిపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ బి. సంజీవ, మాస్టర్‌లు శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్, ప్రభాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా రూ.10వేల సాయం

టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజేందర్ రెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని శీలంపల్లి గ్రామానికి చెందిన దూదేకుల బాబూమియ అనారోగ్యంతో ఉండటంతో ఎల్లయ్యగారి రాజేందర్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, భగవంత్ రెడ్డి, సాయిరెడ్డి, అంజిరెడ్డి, మాణిక్యరెడ్డి, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి

- ప్రిన్సిపల్, వార్డెన్‌లను వెంటనే సస్పెండ్ చేయాలి
- విద్యార్థి కులుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజ్‌పల్లిలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హస్టల్ ప్రిన్సిపల్, వార్డెన్, మరో ఇద్దరు టీచర్ల నిర్లక్ష్యం మూలంగానే పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని మృతి చెందినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్‌లు పేర్కొన్నారు. ఆదివారం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకునేందుకు యత్నించగా, ప్రిన్సిపల్ సరైన సమాచారం ఇవ్వడంలేదని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని గత మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బందులు పడుతున్నా కనీసం ప్రిన్సిపల్ ఆసుపత్రికి తీసుకెళ్లలేదన్నారు. ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావడంతో విద్యార్థిని కింద పడిపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. దాంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి సుమారు నాలుగు లక్షలు ఖర్చు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం మూలంగానే విద్యార్థిని మృతి చెందినట్టు వారు ఆరోపించారు. అయినప్పటికి పాఠశాల రిజిస్టర్‌లో ఎలాంటి సమాచారం రాయలేదని ప్రిన్సిపల్, వార్డెన్ జరిగిన విషయాన్ని చెప్పకుండా వారిని వారు కాపాడుకునే విధంగా మాట్లాడుతున్నారన్నారు. హస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడం, దాంతో పాటు పాఠశాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయకపోవడంతోనే విద్యార్థినికి జ్వరం వచ్చిన విషయం తెలియలేదని, దాంతో విద్యార్థిని జ్వరంతో ఉన్నా కూడా ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు వారు ఆరోపించారు. వెంటనే విద్యార్థిని మృతికి కారణమైన ప్రిన్సిపల్, వార్డెన్‌ను విధుల నుంచి తొలగించి, మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హస్టల్ ముందు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు జగన్ తదితరులు పాల్గొన్నారు.



30 నుంచి 7 వరకు శ్రీ రామనవమి వేడుకలు

మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని అత్యంత పురాతన రాముల వారి గుడిలో ఈ నెల 30 నుంచి 7వ తేదీ వరకు శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ సూచించారు. ఆదివారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పురోహితుల సమక్షంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 30న మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు శ్రీ సీతారాముల కల్యాణం, 7న రథోత్సవం, స్వామి వారి చక్రస్నానం, కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శ్రీరామనవమి వేడుకలకు గ్రామంతో పాటు ఇతర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతం చేయడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-మెదక్ రూరల్

మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలకు జిల్లాలో చక్కటి స్పందన లభిస్తున్నదని, మహిళలు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మహిళ ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లాంఛనంగా ఆరోగ్య మహిళా కేంద్రాలను నెలకొల్పిందన్నారు. మెదక్ జిల్లాలోని పెద్ద శంకరంపేట్, అల్లాదుర్గ్, వెల్దుర్తి, టేక్మాల్, శివ్వంపేట, మనోహరబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన 953 మంది మహిళలకు వైద్య నిర్ధారణ పరీక్షలు చేసి, మెరుగైన వైద్యం, అవసరమైన వారికి చికిత్స కోసం 38 మందిని జిల్లా ఆసుపత్రికి, మరో 8 మందిని హైదరాబాద్‌కు రెఫర్ చేశామన్నారు. వైద్య పరీక్షల నిర్వహణలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 8 విభాగాలల్లో మహిళలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ జరిపి పూర్తి ఉచితంగా చికిత్సను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.క్లినిక్‌కు వచ్చే మహిళల వివరాలను ప్రత్యేక యాప్‌లో పకడ్బందీగా నమోదు చేస్తున్నామని తెలిపారు. నియోజక వర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఆరోగ్య మహిళా కేంద్రం పట్ల 35 ఏళ్ల పైబడిన మహిళలలో వైద్య సేవలు వినియోగించుకునేలా అవగాహన కలిగిస్తూ రెఫర్ చేస్తున్న కేసులను పరిశీలిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 2,57,613 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో 1,20,673 మంది పురుషులు , 1,36,877 మంది మహిళలు, 22 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు 30,172 మందికి రీడింగ్ అద్దాలు ఇచ్చామని, 29,990 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చేందుకు గుర్తించి 18,305 మందికి అందించామన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ముఖ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

విద్యార్థి దశ నుంచే ఆత్మ రక్షణకు ఉపయోగపడే కరాటే లాంటి వాటిపై దృష్టి సారించాలని కరాటే ఆత్మరక్షణకు చాలా ముఖ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ఇంటర్ స్కూల్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు (కంగ్‌ఫ్యూ)లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యం స్కూల్ దండుపల్లి, రిషి మెమోరియల్ స్కూల్, బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ చేగుంట, జెడ్పీహెచ్ఎస్ కానుకుంట పాఠశాలల విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మరొకరిపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ బి. సంజీవ, మాస్టర్‌లు శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్, ప్రభాకర్, మహేష్ పాల్గొన్నారు.

పేస్కేల్ వర్తింపజేయాలని మంత్రికి వినతి



నవతెలంగాణ-నర్సాపూర్

సెర్ప్ మండల సమైక్య జిల్లా సమైక్యలో పనిచేస్తున్న తమకు పేస్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఆదివారం సిద్దిపేటలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు అకౌంటెంట్లు, ఆపరేటర్లు, అటెండర్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్లు కొండి మల్లేశం, సురేష్, రమాదేవి, మమత, ధనలక్ష్మి, శ్వేత, స్వామి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

మాసాయిపేటలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ





నవతెలంగాణ-వెల్దుర్తి

కార్యకర్తల అసమానత కృషితో అపురూప విజయాలు సాధించి రెండుసార్లు రాష్ట్రంలో టీఆం"ఎస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిందని మెదక్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాసాయిపేట మండల కేంద్రంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు స్థానిక సర్పంచి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రాత్రింభవళ్లు శ్రమించి పార్టీని కాపాడుకున్న ఘనత గులాబీ సైనికులకే దక్కిందన్నారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల అంకితభావంతో పనిచేస్తూ అపూర్వ విజయాలు సాధించడంలో కార్యకర్తలదే ముఖ్య పాత్ర అన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా ఎవరికి సాధ్యం కానీ ఏక పక్ష విజయాలు సాధిస్తూ రికార్డులను తిరగ రాసిందన్నారు. ఎమ్మెల్సీ మల్లేశం మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో చేయలేని అభివృద్ధి పనులు రాష్ట్రంలో ప్రవేశపెట్టి తెలంగాణ ప్రజలకు సుఖశాంతుల కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తూ చక్కటి పరిపాలన అందించిన ఘనత ఎమ్మెల్యే మదన్ రెడ్డికే దక్కిందన్నారు. ఉమ్మడి వెల్దుర్తి మాసాయిపేట మండలాల్లో తాగు సాగునీటి కొదవ లేకుండా చేసిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి జెడ్పీటీసీ రమేష్ గౌడ కార్మిక విభాగం అధ్యక్షుడు ఉమ్మన్నగారి దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఎంపీటీసీలు నవనీత శ్రీనివాస్,సోనీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సిద్ధిరాములు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ



నవ తెలంగాణ-సిద్దిపేట : వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, వాసవి క్లబ్ వనిత పూర్వ అధ్యక్షురాలు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పుల్లూరి నాగరాణిల వివాహ వార్షికోత్సవ సందర్భంగా మున్సిపల్ గోశాలలో గోసేవ అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, రీజియన్ సెక్రెటరీ మంకాళ శ్రీనివాస్, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ సోమ శివకుమార్, జోన్ చైర్మన్ సోమవనజ, జిల్లా ఇంచార్జ్ మాంకాళ నవీన్ కుమార్, క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పుల్లూరు శశాంక్, వాసవి క్లబ్స్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి, ఆరవపల్లి హరి కిరణ్, కార్యదర్శులు చకిలం రవి, కొమరవెల్లి కల్పన, ట్రెజరర్ బూరుగు వేణుగోపాల్, పీఆర్వో అయిత శంకర్, మాంకాళ సంతోష్, మాంకాళ సుప్రియ, గ్రీటింగ్ చైర్మన్ మర్యాల వీరేశం, మర్యాల వాణి, బూరుగు సంతోషి, చకిలం వినోద, మాంకాళ అన్నపూర్ణ పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర శివపార్వతుల 38వ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-వెల్దుర్తి

శ్రీదేవి భూదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి శివపార్వతుల 38వ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవం ఆదివారం మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ పూజారి గిరీశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఆదివారం గణపతి పూజ, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, స్థాపిత దేవతామూర్తులకు పంచామృత అభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణంలో భక్తులు పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి కొదవ లేకుండా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జగ్గ అశోక్ గౌడ్ ఆలయ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు హేయమైన చర్య

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, రవీందర్ రెడ్డి





నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, రవీందర్ రెడ్డిలు అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మానవహారంగా ఏర్పడి బీజేపీ డౌన్ డౌన్, నరేంద్ర మోడీ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఓటమి భయంతోనే బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వారు ఆరోపించారు. ఓట్ల రాజకీయం చేస్తూ బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీ ప్రభుత్వ ఆస్తులన్నీ అమ్ముకుంటూ దేశాన్ని దివాలా తీస్తుందన్నారు. ఇప్పటికైనా రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని లేకుంటే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, ఆంజనేయులు గౌడ్, రిజ్వాన్, సురేష్ నాయక్, రషీద్, శ్రీశైలం యాదవ్, అశోక్ గౌడ్, రాధాకృష్ణ గౌడ్ , తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఎంపీ పదవికి అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు వచ్చిన ఆదరణ చూసి బీజేపీ తట్టుకోలేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, ఫిషర్‌మెన్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి మల్లేష్, వెల్దుర్తి సేవా దళ్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, నంబూద్రి గుప్త, పిఎసిఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్, ఎద్దులపల్లి మాజీ సర్పంచి దుర్గ గౌడ్ , నాయకులు కృష్ణ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రామాయంపేట



దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నియంత పాలన సాగిస్తున్నాడని టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు మండిపడ్డారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేయడం మోడీ నియంత పాలనకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ చర్యలను దేశవ్యాప్తంగా మేధావులు, ప్రతిపక్షాలు, ప్రజలు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సంపదను అంబానీ, ఆదానిలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. సిబిఐ, ఈడీలను జేబు సంస్థలుగా మార్చుకొని ప్రభుత్వాలను పడగొడుతూ ఫాసిస్ట్ పాలనను నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. రాహుల్ గాంధీపై నోటికి వచ్చినట్టు వాగితే తెలంగాణలో తిరగకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు. దేశంలో నియంత పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీకి, బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



నవతెలంగాణ-నర్సాపూర్

వెనక నుంచి వచ్చి ట్రాక్టర్ ఢీకొనగా ఓ మహిళ మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాద సంఘటన వివరాలు ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామానికి చెందిన స్రవంతి (30) అనే మహిళ తల్లిగారి గ్రామమైన కాగజ్ మద్దూర్ గ్రామానికి ఉగాది పండుగకు వచ్చింది. ఆదివారం ఉదయం తిరిగి అత్తగారింటికి చింతల్ చెరువుకు వెళ్తున్న క్రమంలో కాగజ్ మద్దూర్‌లోని జితేందర్ క్లినిక్ వద్దకు రాగానే వెనక నుంచి వస్తున్న మహేంద్ర ట్రాక్టర్ బలంగా స్రవంతిని ఢీకొట్టిందని తెలిపారు. దీంతో తీవ్ర గాయాలైన స్రవంతిని సూరారంలోని నారాయణ హృదయాలయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి యాద గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకుమార్ తెలిపారు. కాగా మృతురాలికి భర్త ప్రభు గౌడ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రామాలయంలో కోటి తలంబ్రాల దీక్ష ముగింపు



నవ తెలంగాణ-గజ్వేల్

రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో గత 40 రోజుల నుంచి నిర్విరామంగా నిర్వహిస్తున్న కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం ఆదివారం కృష్ణాలయంలోని రామాలయంలో ముగింపు కార్యక్రమం చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రామ నామ స్మరణ చేసుకుంటూ గోటితో వడ్లను ఒలిచి భక్తిని చాటుకున్నారు. భద్రాచల సీతారాముల కల్యాణానికి గజ్వేల్ నుంచి తలంబ్రాలు వెళ్లడం చాలా ఆనందంగా భక్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామకోటి రామరాజు, కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రాంచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, ఉప్పల మధుసూదన్, సుందర సత్సంగ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా అల్లిపూర్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి ఐదు వేల చొప్పున ఆర్థిక సహాయం, నెలకు సరిపడు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిట్ల సుగుణ, శివంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, అల్లిపూర్ గ్రామ వార్డు సభ్యులు రాజు, అనిల్, దశరథ్, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సాదు, శ్రీను, రాములు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

31న శివంపేటలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణా గౌడ్

నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని దొంతి గ్రామంలోని జీవన్ దివ్య కళ్యాణ మండపంలో ఈ నెల 31వ తేదిన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించనున్నామని పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిల ఆదేశాలతో ఈ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన సభకు శివంపేట మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు. ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా విభాగ నాయకులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

యువత ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికై స్వచ్ఛభారత్





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గ్రామాలలో యువత చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాలు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. తూప్రాన్ మండలం ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో మేకిన్ మల్కాపూర్, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం 352వ రోజుకు చేరుకుంది. గ్రామంలోని రెండవ వార్డులో 5వ బ్లాక్‌లో స్వచ్ఛ భారత్ చేపట్టి వీధులలో చీపుర్లతో ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే నాటిన మొక్కలకు, చెట్లకు పాదులను తీసి నీటిని పోశారు. గ్రామ అభివృద్ధి పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతున్నట్టు గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు, నాయకులు మన్నె నవీన్ యాదవ్, పాప నర్సింలు తెలిపారు. అలాగే మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు ఆదివారం 258వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలోని హరిత వనం పార్క్‌లో ఉన్న బుద్ధుని విగ్రహం చుట్టు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అలాగే పార్క్‌లో ఉన్న అరుదైన మొక్కల సంరక్షణ కోసం పాదులను తీసి నీటిని పోశారు. నేచర్ ఐ కాన్ యూత్‌తో పాటు చిన్నారులు సైతం స్వచ్ఛభారత్‌లో పాల్గొని గ్రామ పరిశుభ్రతలో పాలు పంచుకుంటున్నారు. కూచారం గ్రామంలో గత 258 వారాలుగా చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

నవతెలంగాణ 4
సిద్దిపేట
సోమవారం 27 మార్చి 2023



రెడ్డి సంక్షేమ భవనాలకు ప్రభుత్వం సహకారం

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్ధిపేట : హైదరాబాదులో సుమారు 250 కోట్ల విలువగల భూమిని రెడ్డి సంక్షేమ భవనం కోసం సీఎం కేసీఆర్ కేటాయించారని, అక్కడ ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో రెడ్డి సంక్షేమ భవనాన్ని టీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షులు రెడ్డి అరవింద రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మొట్టమొదటి ఏసి రెడ్డి ఫంక్షన్ హాల్ సిద్దిపేటలోనే నిర్మాణం చేసుకునామన్నారు. హైదరాబాదులో రెడ్డి హాస్టల్ ఉందని, ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అరవింద రెడ్డి కోరిక మేరకు త్వరలోనే భవనం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోజా శర్మ ఫారుక్ హుస్సేన్, సంపత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాణిక్య రెడ్డి, రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.

కథా రచనలో ప్రశంసలు, పారితోషికం అందుకున్న విద్యార్థులు



నవతెలంగాణ-చేర్యాల

ఉగాది బాలల కథల పోటీలో సిద్దిపేట సుగుణ సాహితీ సమితి వారు నిర్వహించిన కథా రచనలో మండల పరిధిలోని వేచరేణి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు పారితోషికాలు అందుకున్నారు. సుమారు 20 మంది విద్యార్థులు వివిధ అంశాలపై కథలు రాయగా 7 వ తరగతి విద్యార్థిని అంజలి ప్రధానోపాధ్యాయులు కె విఎన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో పారితోషికం అందజేస్తారని ఉపాధ్యాయుడు మంగళగిరి రామచంద్ర మూర్తి తెలిపారు. సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య, ఎస్ఎం సీ చైర్మన్ యాదగిరి, ఎంపీటీసీ లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జన చైతన్య యాత్రకు తరలి వెళ్లిన కామ్రేడ్స్



నవతెలంగాణ-చేర్యాల

నిర్మల్‌లో ప్రారంభమైన సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర ఆదివారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్క పల్లి వస్తున్న సందర్భంగా స్వాగతం పలికేందుకు చేర్యాల మండలం నుంచి సీపీఐ(ఎం) శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో మాట్లాడుతూ కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశంలో లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని మంట కలుపుతుందని విమర్శించారు. మతోన్మాదాన్ని అవలంబిస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుందన్నారు. దేశ సంపదనంతా కార్పొరేటు గుత్తా పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న ఈ తరుణంలో కార్మికులు, రైతులు, కూలీలు, మధ్యతరగతి పేద ప్రజలంతా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పెద్ద ఎత్తున గలమెత్తి పోరాడాలని కోరారు. నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కుట్రలను చిత్తు చేయాలని ఈ విధానాలను జనాలకు అర్థమయ్యే రీతిలో తెలియజెప్పడమే జన చైతన్య యాత్ర ఉద్దేశమని తెలిపారు. ఈ జనచైతన్య యాత్రను ప్రజలంతా కలిసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండ కింది అరుణ్ కుమార్, రాళ్ల బండి నాగరాజు, పోలోజు శ్రీహరి, రేపాక కుమార్, గొర్రె శ్రీనివాస్, రాళ్ల బండి భాస్కర్, గుండ్ర రవీందర్, తాడూరి నర్సింలు, ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాలకు చక్రధర్ గౌడ్ ఆర్థిక సాయం



నవ తెలంగాణ-మద్దూరు

కౌలు రైతు కుటుంబాలకు ఫార్మర్స్ ఫాస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ లక్ష రూపాయల చొప్పున నలుగురు కౌలురైతులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామానికి చెందిన పుల్లూరి మహేందర్, బోయిని యాదయ్య, మెతకాని యాదయ్య, గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన మీసా సత్యనారాయణలు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాల పరిస్థితిని బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బొంగోని సురేష్ గౌడ్ ఫార్మర్స్ ఫాస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. కౌలు రైతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మద్దూరు మండల అధ్యక్షుడు యామ శ్రీకాంత్, రచ్చ సంతోష్, బొల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

చిట్టాపూర్ సర్పంచ్ పోతానక రాజయ్య



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

రక్తదానం మరొకరికి ప్రాణదానమని చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ పోతనక రాజయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని చిట్టాపూర్ గ్రామంలో ఆదివారం హీరోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ హీరోస్ ఫౌండేషన్ సిబ్బంది నరేష్, గణేష్ , ప్రవీణ్,ఉదయ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతానక రాజయ్య మాట్లాడుతూ మానవ మనుగడలో రక్తం అతి ముఖ్యమన్నారు. ప్రమాదాల భారీన పడినప్పుడు, అత్యవసర సమయంలో ఉన్నవారికి ఈ రక్తసేకరణ దోహదపడుతుందన్నారు. ప్రతియేటా ఉదయ్ ఆధ్వర్యంలో జరిగే రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. మరొకరి ప్రాణాన్ని కాపాడేందుకు యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. శిబిరానికి సహకరించిన సర్పంచ్ ని ఫౌండేషన్ సిబ్బంది సన్మానించారు. అంతక ముందు సర్పంచ్ ఉదయ్‌ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ప్రమోద్, అజయ్ పూర్ణచంద్, స్వామి, కిశోర్, తరుణ్,, అరుణ్, సతీష్, గ్రామస్తులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల బిల్లుల చెల్లింపులను నిలిపివేయడం సరికాదని, ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రభుత్వం వెంటనే బిల్లులన్నీ చెల్లించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాజ్ సురేష్ కోరారు. స్థానిక శిశు మందిర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బిల్లులన్నీ ఖజానా శాఖ ఆమోదం పొందినప్పటికీ, వాటికి నగదు చెల్లించకపోవడం వల్ల ఉపాధ్యాయులు అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిఆర్సి మొత్తాన్ని ఏకకాలంలో చెల్లించాల్సింది పోయి వాయిదాల పద్ధతిలో కూడా నగదు చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. సప్లిమెంటరీ వేతనాలు, పిఆర్సీ బకాయిలు, డిఎ బకాయిలు, వైద్య బిల్లులు, సెలవు వేతనాలు, పెన్షనరీ బకాయిలు, టిఎస్ జిఎల్ఐ , జిపిఎఫ్ క్లైములు తదితర పెండింగ్ బిల్లులన్నింటినీ మార్చి 31 లోగా చెల్లించే విధంగా చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు తిరుపతి, శ్రీనాకర్ రెడ్డి, సింగోజు జనార్ధన్, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, జిల్లా , వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరన్నపేటలో ఉచిత గుండె వైద్య శిబిరం



నవతెలంగాణ-చేర్యాల : మండల పరిధిలోని వీరన్న పేటలో హైదరాబాద్‌లోని ప్రతిమ ఆసుపత్రి, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. 256 మందికి పరీక్షలు చేసి, ఆరుగురిని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపాక బిక్షపతి పాల్గొన్నారు.

బీజేపీది ముదనష్టపు పాలన

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య
- జనచైతన్య యాత్రకు ఘన స్వాగతం

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ ప్రజలందరిని క్షేత్ర స్థాయిలో కలుస్తూ తొమ్మిదేండ్లలో బీజేపీ పరిపాలన ఎంత ముదరష్టపు పాలన చేస్తోందో ప్రజలకు తెలియజేయడమే జన చైతన్య యాత్ర ప్రధానోద్దేశమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవక్కపల్లి స్టేజ్ వద్ద జిల్లా, మండల సీపీఐ(ఎం) నాయకులు, ప్రజా నాట్య మండలి కళాకారులు డప్పుచప్పుళ్లతో జన చైతన్య యాత్ర బృందం సభ్యులు ఎస్.వీరయ్య, ఆశయ్య, స్కైలాబ్ బాబు, అడివయ్య, జయలక్ష్మి, బాలకృష్ణ, జగదీష్‌లకు జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి కళావతి, కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, ఎల్లయ్య భాస్కర్, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్ మావో, కిష్టారెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, అమ్ముల బాల్ నరసయ్య, అత్తిని శారద, బండకింది అరుణ్ కుమార్, మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, దాసరి ప్రశాంత్, పార్టీ కార్యాలయ కార్యదర్శి





జాలిగం శిరీష, మండల కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో పరిపాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తూ అంబానీ, అదానీల బొజ్జలు నింపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై భారం మోపుతోందన్నారు. ప్రజా వ్యతిరేక, భారాలు మోపే విధానాలను అవలంబిస్తున్న వైఖరివల్ల ప్రభుత్వంపై వస్తున్న అసంతృప్తిని బీజేపీ నేతలు గమనించి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని తెలిపారు. సామాన్య ప్రజలను, శ్రామికులను మతం పేరుతో చిచ్చు పేడుతూ ఓట్లు దండుకునే రాజకీయానికి తెర లేపుతోందన్నారు. ఓటు బ్యాంకును రూపొందించుకునే ప్రయత్నంలో బీజేపీ ప్రభుత్వమున్నదని తెలిపారు. సమస్యల పరిష్కారం, సంక్షేమ ఫలాల సాధనకు ప్రజలందరూ ఐక్యంగా ఉన్నప్పుడే విజయం సాధించొచ్చని సూచించారు.అ నంతరం భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో జిల్లా కేంద్రానికి జన చైతన్య యాత్ర ప్రారంభమైంది. పార్టీ శాఖ కార్యదర్శిలు, పార్టీ సభ్యులు కనకయ్య, తునికి మహేష్, బండ్ల స్వామి, అరవింద్, నవీన్, సంతోష్, సంజీవ్, రంజిత్ రెడ్డి, బొమ్మిడి సాయిక్రిష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - చిన్నకోదూరు

జన చైతన్య యాత్ర సిద్దిపేట జిల్లా బెజ్జంకి నుండి చిన్నకోడూరు మండలంలోకి చేరుకొని డప్పుచప్పుళ్ల నడుమ వందలాది బైక్ ర్యాలీల నడుమ సిద్దిపేటకు చేరుకుంది. కార్యక్రమంలో జన చైతన్య యాత్ర బృంద సభ్యులు ఎస్ వీరయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఆశయ్య, స్కైలాబ్ బాబు, అడివయ్యా, జయలక్ష్మి, బాలకృష్ణ, జగదీష్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి కళావతి, కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, రైతు సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దినదినాభివృద్ధి చెందుతున్న గజ్వేల్

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ దినదిన అభివృద్ధి చెందుతుందని తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని శ్రీగిరి పల్లి రింగ్ రోడ్డు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరీ వెంచర్‌ను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంతోపాటు మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నూతన వెంచర్లు ఏర్పడి భవనాల నిర్మాణాలకు నోచుకోని పట్టణ విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతుందన్నారు. హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న విలువైన షాపింగ్ మాల్, వ్యాపార ఇతర రంగాలకు చెందిన మాల్స్ రావడంతో గజ్వేల్ పట్టణంలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. గజ్వేల్‌కు రింగ్ రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి జరుగుతుందని నూతనంగా ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరీ వెంచర్ అన్ని సౌకర్యాలతో బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కృష్టారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియుద్దీన్, కౌన్సిలర్స్ ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్,కో ఆప్షన్ సభ్యులు, నాచారం దేవస్థానం డైరెక్టర్ నంగురి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు సయ్యద్ మతీన్,హైదర్, బి ఆర్ ఎస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, శివ కుమార్, సంజయ్, తోట బిక్షపతి,ఆదిములం నారాయణ, ఇటిక్యాల సర్పంచ్ చంద్ర శేఖర్, రాజ రాజేశ్వరీ వెంచర్ భాగస్వాములు తదితరులు పాల్గొన్నారు.

జేవివి ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం

రాష్ట్ర కార్యదర్శి పి నర్సింలు

నవ తెలంగాణ - సిద్దిపేట



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం విద్యార్థుల్లో పెంపొందించడానికి రాష్ట్ర స్థాయిలో, ప్రజల్లో మూఢ నమ్మకాల మీద చైతన్యం తీసుకురావడానికి అనేక కార్యక్రమంలో నిర్వహిస్తున్నామని జేవివి రాష్ట్ర కార్యదర్శి పి నర్సింలు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్లీనమ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో జిల్లా గౌరవ అధ్యక్షులు కే.మహేంద్రం అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు మహేంద్రము మాట్లాడుతూ సహజ పానియాలు సేవించండి, శీతల పానీయాలు మానండి అనే నినాదంతో వేసవిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ప్రజలను ఆరోగ్యకరమైన శాస్త్రీయ సమాజం నిర్మాణం కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో చెకుముకి సైన్స్ సంబరాలల్లో 22 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నూతన సైన్స్ ఆవిష్కరణలు తెలుసుకోవడం కోసం "చెకుముకి బాలల సైన్స్ మాస పత్రిక " జన విజ్ఞాన వేదిక విద్యార్థుల కోసం ప్రచురిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మ సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ములుగు బాలరాజు, జిల్లా కోశాధికారి సాదత్ అలీ, సిద్దిపేట పట్టణ కమిటీ అధ్యక్షులు మహేందర్, చేర్యాల మండలం బాధ్యులు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-బెజ్జంకి



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి ఆవరణ వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన పబ్బతి అజయ్(22) స్వంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయదేరి అతివేగంతో కారును డీకొట్టాడు. దీంతో యువకుడి కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు 108 అంబులేన్స్ సిబ్బందికి సమాచారం అందిచడంతో మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మానవత్వం చూపని ప్రయివేట్ ఆస్పత్రి సిబ్బంది..!

మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి అవరణ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు రోడ్డుపై ఎండ తీవ్రతకు అవస్థలు పడుతుంటే ప్రయివేట్ ఆస్పత్రి కనీసం మానవత్వం చూపలేదని..మానవత్వం చూపని ప్రయివేట్ ఆస్పత్రి సిబ్బంది చికిత్సలు ఏ విధంగా అందిస్తారోనని పలువురు స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న గాయపడిన యువకిడికి మానవత్వంతో స్ట్రేచర్ సహయం అందించాలని ప్రాదేయపడిన వైద్యులు లేరంటూ దురుసుగా ప్రయివేట్ ఆస్పత్రి సిబ్బంది ప్రవర్తించడంపై స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యాలు దోచుకోవడమే కాని నిస్సహాయస్థితిలో ఉన్న బాధితులకు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స వైద్య సేవలు అందించడం లేదని పలువురు వాపోతున్నారు.

విగ్రహా ప్రతిష్ఠలో పాల్గొన్న మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరెపల్లి మదిరె గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తన్నీరు హరీశ్ రావు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ తల్లి దయతో సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కరువు తొలగిపోయిందని తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో చెరువులు, కుంటలు నిండుకుండలా కలకళలాడుతున్నాయని పేర్కొన్నారు. మండు టెండలలో సైతం నంగునూరు మండలంలో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య,మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫామ్ వెల్ఫేర్ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి,రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, సోసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, యంపీటీసీ బెదురు తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిప్పని నాగేందర్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ నిర్వహాకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



ఇంటి పరిసరాలతో పాటు మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని వార్డుల వారిగా పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించటం, బహిరంగ మలమూత్ర విసర్జన, ఇంటిలోని టాయిలెట్స్ వాడకం వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. హుస్నాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని మహిళలతో కలిసి చైర్మన్, కౌన్సిలర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బోజు రమాదేవి రవీందర్, బొజ్జ హరీష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆర్పిలు శ్రీలత,ఆర్ పి చామంతుల యశోద, ఆశా కార్యకర్త జాల వాని, దోమ ఆగయ్య, బోజు రాజయ్య, జాల లచ్చవ్వ బోజు రాజవ్వ జాల కాంతవ దోమ లచ్చవ్వ మైల స్వరూప బోజు స్వరూప బోజు రాధిక శిల్ప , వార్డ్ మహిళలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ చేయాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలో ఉన్న గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చౌడుతండ, బోదర్వాగు తండ , మంజ్యా నాయక్ తండ, మూడు గిరిజన తండాలను కలుపుతూ చౌడుతండను నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్‌కు ఆదివారం గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపెట ఎంపీపీ మాలోతు లక్ష్మి-భీలు నాయక్, అక్కన్నపేట జెడ్పీటీసీ భూక్యా మంగ- శ్రీనివాస్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ధరావత్ తిరుపతి,అక్కన్నపేట మండల బీఆర్ ఎస్ అద్యక్షులు పేసరు సాంబరాజు, తెరాస పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, నునావత్ మోహన్ నాయక్, గుగులోతు రాజునాయక్, భూక్యా సుధాకర్ నాయక్, గుగులోత్ అర్జున్ నాయక్, భూక్యా జవహర్ లాల్ నాయక్, మరియు గిరిజన తండాల నాయకులు, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల సర్పంచ్‌కు గ్రామస్తుల సన్మానం

నవతెలంగాణ-జగదేవపూర్



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామ పంచాయతీ స్థాయిలో అధిక అవార్డులను సాధించిన ఇటిక్యాల గ్రామ సర్పంచ్ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్‌కు ఆదివారం గ్రామస్తులు ఘన సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు మాట్లాడుతూ జగదేవపూర్ మండలం ఇటిక్యాల గ్రామ పంచాయతీనీ ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామ పంచాయతీ స్థాయిలో 9 విభాగాలలో దీన్ దయాళ్ అవార్డులు ఐదు విభాగాలలో అందుకున్న జిల్లాలోని మొట్ట మొదటి గ్రామపంచాయతీ ఇటిక్యాల అని అన్నారు. అందుకు కృషి చేసిన సర్పంచ్ చంద్రశేఖర్ అభినందనీయులని సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ లాంటి యువ సర్పంచ్ ఎందరికో ఆదర్శనీయుడని కొనియాడారు. దశాబ్దాల కాలంలో అభివృద్ధి జరగని అభివృద్ధి యువ నాయకుడు చంద్ర శేఖర్ సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ పాలక వర్గం, సోషల్ వర్కర్ నర్సోల్ల గణేష్, గ్రామ రైతు అధ్యక్షులు ఆడెపు బిక్షపతి పిఏసిఎస్ డైరెక్టర్ వెంకటేష్, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నర్సోల్ల స్వామి,మాజీ కొండపోచమ్మ డైరెక్టర్ దొడ్డి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రెడ్డిలకు ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలి

ఏప్రిల్ 11న నిరసన దీక్ష



నవతెలంగాణ-నంగునూరు : రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏప్రిల్ 11న నిరసన దీక్ష చేపడుతున్నట్లు నంగునూరు, సిద్దన్నపేట, రాంపూర్, మగ్దుంపూర్, అంక్షాపూర్, వెంకటా పూర్ గ్రామాల్లో దీక్ష పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటును అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన, ఉప ఎన్నికల్లో కూడా ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కుడా రెడ్డి ఆత్మీయ సభల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు అమలు చేస్తామని ప్రకటనలు చేశారరన్నారు. కాని నేటి వరకు అమలు చేయలేదన్నారు. రెడ్డిలలోని అనేక మంది పేదలు కనీసం రెండు పూటల తిండి కూడా తినలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలల్లో రెడ్డి నిరు పేదలకు అందని ద్రాక్షలగా మారిందని పేర్కొన్నారు. ప్రతి సంక్షేమాన్ని రెడ్డి పేదలకు అదేవిధంగా ప్రభుత్వం చూడలన్నారు. ఏప్రిల్ 11న సిద్దిపేట ముస్తాబాద్ చౌరస్తాలో జరిగే దీక్ష కార్యక్రమానికి రెడ్డిలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు మారెడ్డి రాంలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణు వర్ధన్ రెడ్డి, మహిళ విభాగాం అధ్యక్షురాలు కెసిరెడ్డి శశికళరెడ్డి, ఉపాధ్యక్షులు హనుమండ్ల లక్ష్మా రెడ్డి, గూడ పద్మ, కొమ్మిడి తిరుమల, నర్రా సిద్దా రెడ్డి, నర్సింహ్మా రెడ్డి, గాల్ రెడ్డి, జానకి రాం రెడ్డి, ముకుందా రెడ్డి యూత్ అధ్యక్షుడు డాకూరి భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సిద్దార్ధ రెడ్డి, తిరుపతిరెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రేకులపల్లి కోటీశ్వర్ రెడ్డి, రేకులపల్లి భాస్కర్ రెడ్డి, కొడారి లక్ష్మారెడ్డి, గోక భూపతిరెడ్డి, రవీందర్, బండారి రంజిత్ రెడ్డి, రాజ్ కుమార్ రెడ్డి, బూసిరెడ్డి మహేందర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, చంద్రారెడ్డి, మైసారెడ్డి సతీష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లా రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు మోడీ సర్కారు దుశ్చర్య

నవ తెలంగాణ-దుబ్బాక : మోడీ సర్కారు అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, రాహుల్‌పై అనర్హత వేటు వేయడం మోడీ సర్కారు దుశ్చర్యగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అభివర్ణించారు. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాల్సింది పోయి ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం పురపాలిక పరిధిలోని చెల్లాపూర్, దుంపలపల్లి వార్డుల్లోని పోచమ్మ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించిన చేర్వాపూర్ వార్డ్‌కు చెందిన చిట్టిపాక విజయ్, బదనకంటి రఘు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమి రెడ్డి, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1988-89 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు 34 సంవత్సరాల అనంతరం వారు చదివిన నంగునూరు ఉన్నత పాఠశాలలో కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ సమాచారాన్ని తెలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులైన గౌరీభట్ల నరసింహ్మాస్వామి, రొడ్డ రామచంద్రా రెడ్డి, ఎల్లంకి రామచంద్రా రెడ్డి, ఆనందయ్య, సోమరాజ్యం, సంజీవరెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, నర్సింలు, హన్మంతరెడ్డి, ఆరగొండ ముకుందంలను ఘనంగా సన్మానించారు.

కేశవాపూర్ శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-అక్కన్నపేట



మండలంలోని కేశవాపూర్ గ్రామంలో రామస్వామి గుట్టపై పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం హుస్నాబాద్ శాసనసభ్యులు సతీష్ కుమార్ ఆలయ అధ్యక్షులు ముత్తినేని రాజేశ్వరరావు ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనగా హెూమం, కళ్యాణ మహెూత్సవం అంగరంగ వైభవంగా వేదమంత్రాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మగాని రాజేశం, ఎంపీపీ ఎంపీపీ మాలోత్ లక్ష్మీ బీలు నాయక్, జడ్పిటిసి భూక్య మంగ శ్రీనివాస్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సాంబరాజు, కందుల రామిరెడ్డి, నక్క రాజు తోపాటు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు స్నేహితుల చేయూత

రూ.10,116 చొప్పున ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బెజ్జంకి వ తన తోటి చదివిన సహచర స్నేహితుల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ అండగా నిలుస్తున్నారు 1988-89 విద్యాసంవత్సరం పదవతరగతి విద్యార్థులు. అదివారం మండల పరిధిలోని ముత్తన్నపేట, చీలాపూర్ గ్రామాలకు చెందిన బండోజు వీరబ్రహ్మం, కొంకటి బాబు ఆనారోగ్య కారణాల దృష్ట్యా మృతి చెందిన విషయం విధితమే. తమ సహచర విద్యార్థి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనందించాలనే సంకల్పంతో రూ.10,116 చొప్పున మృతుల కుటుంబాలకు ఆర్థిక సహయమందజేశారు. ఆర్థికంగా చేయూతనందించిన తోటి సహచర విద్యార్థి బృందానికి మృతుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడు తొప్పెట ఓదయ్య, దామెర శంకర్,నరెడ్ల శ్రీను, బొట్ల లింగయ్య, మచ్చ వెంకటేశం పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల : చేర్యాల పట్టణ కేంద్రంలోని 2వ వార్డులో మాల మహానాడు యూత్ సభ్యుడు కమలాపురం రాజు (దేవేందర్) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. అతని కుమారుడు అనారోగ్యంతో బాద పడుతున్న విషయాన్ని మాల మహానాడు యూత్ పట్టణ అధ్యక్షుడు చందా శ్రీకాంత్ తెలుసుకొని యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చందా శ్రీకాంత్, కమలాపురం రమేశ్,దోమ శ్రీకాంత్,చందా అనిల్,బుట్టి సాయి,కాటం రాజశేఖర్, శ్రీరామ్, బాబి,మంగ వాసు,కాటం మహేశ్, కమలాపురం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో మున్సిపల్ పాలకవర్గం ఉందా?

మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి

నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం ఉందా లేదా అనేది తెలియడం లేదని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నిరుడు స్వామి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఉన్న ఇందిరాపార్క్ కోట మైసమ్మ రోడ్డు పూర్తిగా వర్షం నీరుతో నిండి రాకపోకలకు ఇబ్బంది ఉందని ఆయన రోడ్డును పరిశీలించారు. మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని కుర్చీలకే పరిమితమయ్యారని అదే పద్ధతిలో మున్సిపల్ పాలకవర్గం ఉందన్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నియోజకవర్గ కేంద్రంలో ఈ దుస్థితి ఇంకెంతకాలం ఉంటుందని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ పాలకవర్గం ఉన్నా లేనట్టుగా కనిపిస్తుంది అన్నారు. కోట మైసమ్మ రోడ్డు నడవలేని పరిస్థితి గుంతలు గుంతలు గా ఉందని దీంతో వర్షం పడడంతో ప్రయాణికులకు, పాదాచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు కుర్చీలు



వదలడం లేదని ఆయన విమర్శించారు. మున్సిపల్ పాలకవర్గం అధికారులు సమనీయంతో లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కోట మైసమ్మ రోడ్డు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట

సీఎం కేసీఆర్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి కోరారు. ఆదివారం మెదక్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వెంక టరావుపేటలో గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు సీనియర్ కార్యకర్తల సహకారంతో ప్రజల్లోకి వెళ్లడం జరుగుతుందన్నారు. బూత్ కమిటీలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ నాయకులు డబ్బికారి పెంటోజీ,పిట్ల వెంకటయ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కంకణాల నరసింహులు మాట్లాడుతూ కార్యకర్తలు ముందుండి పనిచేసి వెంకట్రావుపేట గ్రామాన్ని గులాబీ అడ్డగా మరోసారి నిలబెట్టాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో వేంకట్రావు పేట గ్రామానికి చెందిన



బెజ్జనమైన నవీన్‌కు రూ.12 వేలు,ఎర్రోళ్ల శ్రీనివాస్ రూ.12 వేల చెక్కు లను అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈదిగాళ్ల పర్శరాములు,ఆత్మ కమిటీ డైరె క్టర్ సుతారి రాములు,రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బండారు స్వామి గౌడ్,వార్డు సభ్యులు ఎల్ లింగం,ఎంగలి వినోద లక్ష్మణ్, పాత్కుల లక్ష్మీ వెంకటయ్య, బెజ్జనమైన రవి, కల్లెపు యాదగిరి, నాయకులు డాక్టర్ రాజేష్, ఒలపు సత్యనారాయ ణ,బెజ్జనమైన శ్రీనివాస్, పాత్కుల లింగం, ఎర్రోళ్ల చంద్రం, బాలయ్య, బండారు రమేష్ గౌడ్,నెరేళ్ల వెంకటేష్,కల్లెపు రమేష్,సింగోజి కృష్ణ,పంది నర్సింలు,పోతరాజు రవీందర్,కల్లెపు నరేష్ కుమార్,వడ్డే నర్సింలు,ఎండీ అజాం, ఈదుగళ్ల స్వామి, నవీన్, సంపత్, వీరేశ్, ఆంజనేయులు, బాలమల్లు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో సతీష్ అన్న అభిమాన సంఘం

వ్యవస్థాపక అధ్యక్షుడు మార్క అనిల్ గౌడ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సతీష్ అన్న అభిమాన సంఘం ఏర్పాటుకు యువత ముందుకు వస్తున్నారని సతీష్ అన్న అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మార్క అనిల్ గౌడ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేలేరు మండలం కన్నారం గ్రామ కమిటీని సతీష్ అన్న అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మార్క అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొలుగూరి క్రాంతి కుమార్, ఉపాధ్యక్షునిగా చిలుముల సురేష్, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి రమేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా మిడిదొడ్డి నరేష్, కార్యదర్శిగా డప్పు సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మిడిదొడ్డి రఘుపతి, కార్యదర్శి గా బోయిని కిషోర్, కన్వీనర్ గా అజీమొద్దీన్ సయ్యద్ , కో - కన్వీనర్‌గా సయ్యద్ గౌసొద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ గా మిడిదొడ్డి సంపత్ ను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.



ఈ కార్యక్రమంలో సతీషన్న అభిమాన సంఘం ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, సంయుక్త కార్యదర్శి డప్పు నాగరాజు,ఆర్గనైజింగ్ కార్యదర్శి కాయిత నవీన్ రెడ్డి, సతీషన్న అభిమాని ప్రేమ్ కుమార్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి



నవ తెలంగాణ- దౌల్తాబాద్ : పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామ పంచాయతీ మధిర గ్రామమైన పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్రమైన సత్తయ్య రైతు ప్రతిరోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలం వద్ద పాడి ఎడ్లను కట్టేసి ఉంచారు. శనివారం రాత్రి పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందింది. దీని విలువ సుమారుగా రూ 70 వేలు ఉంటుందని తోటి రైతులు తెలిపారు.

హరి హర రెసిడెన్సికాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ-సిద్దిపేట

హరి హర రెసిడెన్సికాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా నాచగోని సత్యం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గణపతి సంతోష్ కుమార్, ఆర్థిక కార్యదర్శిగా ఐలయ్య ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా కిరణ్, దుర్గయ్య, మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా మహేందర్ రెడ్డి, నజీరుద్దీన్ ఆడిట్ కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, శ్రీధర్ భోగేశ్వర్, గౌరవ సలహాదారులుగా రాధాకృష్ణ , శ్రీధర్ రెడ్డి, రాములు , లింగమూర్తి, తిరుపతిరావు, గౌరవ అధ్యక్షులుగా ఆకుల సత్యనారాయణ, మల్లారెడ్డి, పిఆర్ఓగా సంగీతం నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మంత్రికి పీఆర్టీయూ కృతజ్ఞతలు



నవతెలంగాణ-సిద్దిపేట : జిల్లాకు పదవతరగతి మూల్యాంకన కేంద్రం మంజూరు చేయించిన మంత్రి హరీశ్ రావుకు ధన్యవాదాలు తెలిపి, సన్మానించినట్లు పిఆర్టియు సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ, పంతం వెంకటరాజంలు తెలిపారు. ఆదివారం శాసన మండలి సభ్యులు కూర రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో కలిసి మంత్రిని సన్మానించారు. జిల్లా విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందిందని, విద్యారంగానికి , ఉపాధ్యాయులకు ఏ సౌకర్యాలు కావాలన్నా సమకూరుస్తానని, పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ప్రధాన స్థానంలో ఉంచాలని మంత్రి కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మనుమయ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ మనుమయ (వడ్రంగి) సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహెూత్సవం ఆదివారం పట్టణంలోని స్థానిక శ్రీ గాయత్రీ విశ్వకర్మ భగవాన్ దేవాలయ ప్రాంగణంలోని జయశంకర్ సార్ కళ్యాణ మండపంలో బ్రహ్మశ్రీ కొత్తపల్లి శంకరాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా పబ్బోజు యాదగిరి ఆచార్యులు, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్యగారి శ్రీనివాస్ ఆచార్యులు, కోశాధికారిగా మేడోజు నర్సింహాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీసీ బహుజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

బాబా సాహెబ్ అంబేద్కర్ బాటలో నడుద్దాం

నవతెలంగాణ-రాయపోల్ : భారతదేశానికి దిక్సూచిలాగా రాజ్యాంగాన్ని రచించి దేశం కోసం ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలను నిర్మించి స్వేచ్ఛాయుత దేశం కోసం పోరాడిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బాటలో నడుద్దామని ఆటో యూనియన్ అధ్యక్షులు మాసాన్ పల్లి రాములు అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం కేంద్రంలో జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆటో యూనియన్ డ్రైవర్లు అనిల్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ప్రధాని మోడీ దిష్టి బొమ్మ దగ్ధం

నవ తెలంగాణ-ములుగు : రాహుల్ గాంధీపై వేటు వేయడం అనైతిక చర్య అని ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా అన్నారు . ఆదివారం వంటిమామిడి చౌరస్తాలో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా అనర్హత వేటు వేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా రాహుల్ గాంధీ పై అనర్హత వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కర్ణాకర్ గౌడ్, రాజు యాదవ్ మహేందర్ బల్ నర్సింహా స్వామి నవీన్ సందీప్ రెడ్డీ నర్సిహారెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.